క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి దేవాలయానికి విరాళం



కొత్తకోట: కొత్తకోట పట్టణంలో వేంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీకి 11వ వార్డుకు చెందిన మదనాపురం మార్కెట్ పాలక మండలి మాజీ అధ్యక్షులు శ్రీ.శే. పాపయ్యగారి కొండా రెడ్డి వారి కుమారులు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి, పాపయ్యగారి రాఘవేందర్‌రెడ్డి, పాపయ్యగారి నరేందర్ రెడ్డిలు తమ వంతు సహాయంగా రూ.25 వేలు విరాళం అందజేశారు. దాతలకు వేంకటేశ్వరస్వామి దేవాలయం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేసిన ఆశా కార్యకర్తలు



పాన్‌గల్: ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ఆశా కార్యకర్తలు పాల్గొంటారని కోరుతూ మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌కు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకురాలు రేణుక, మహేశ్వరిలు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకురాలు లక్ష్మి, అలివేల, సావిత్రి, లలిత పాల్గొన్నారు.



వీపనగండ్ల: ఆశా వర్కర్లకు పారితోషకం ఇవ్వని ప నులను చేయించకుండా పని భారాన్ని తగ్గించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ జిల్లా నాయకురాలు లక్ష్మీ దేవమ్మ, రేణుక అన్నారు. ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్స్ పాల్గొంటారని, సమ్మె నోటీసును నోడల్ అధికారి వంశీకృష్ణ, మండల వైద్యాధికారి రాజశేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ మండల నా యకురాలు లక్ష్మి, పార్వతి, వెంకటమ్మ, భాగ్యమ్మ, వెంకటేశ్వరమ్మ, సునిత, శారద పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



వీపనగండ్ల: చిరుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని రైతువేదికతో పాటు గో పల్‌దిన్నె, బొల్లారం గ్రామాలలో చిరుధాన్యాల సాగులో పాటించాల్సిన మెలకువలపై అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల ద్వారా సూచనలు, సలహాలు ఇప్పించడంపై రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతునేస్తం కార్యక్రమంలో ఏడీఏ డాకేశ్వర్‌గౌడ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



వనపర్తి రూరల్: మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని చిమనగుంటపల్లిలో చోటుచేసుకుంది. జూన్ 18 నుంచి నల్ల మల్ల సైదులు భార్య కవిత కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బొందపల్లి గ్రామానికి చెందిన నల్లమల్ల కవిత కొద్దిరోజుల క్రితం తల్లిగారి ఊరు చిమనగుంటపల్లికి వెళ్లింది. అక్కడి నుంచి జూన్ 18న హైదరాబాద్‌లో ఉన్న భర్తకు ఫోన్ చేసి వస్తున్న ట్లు చెప్పి వనపర్తి బస్టాండ్‌కు వచ్చింది. ఆమె హైదరాబాద్‌కు వెళ్లకపోవడంతో భర్త బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థికసాయం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన నేశ బలరాం ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10వేలు, ఆంజనేయులు సాగర్ రూ.5 వేలు అందజేశారు.

ఔత్సాహికులకు నిరుత్సాహం

- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుకు నోచుకోని స్పోర్ట్స్ స్కూల్
- క్రీడా పాఠశాలలో చేరికకు చాలా మంది ఆసక్తి
- స్థానికంగా లేకపోవడంతో కొందరికే అవకాశం
- తెలంగాణ క్రీడా పాలసీలోనైనా చోటు కల్పించాలని వేడుకోలు



వనపర్తిలో జరిగిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ స్కూళ్లు ఔత్సాహిక క్రీడాకారులకు వరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్ (హకీంపేట), కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొదట జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయి సెలక్షన్స్ జరుగుతాయి. రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు ఈ మూడు స్కూళ్లలో ప్రవేశాలు పొందుతారు. ప్రతి పాఠశాలలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో జిల్లాస్థాయి సెలక్షన్స్‌కు ముగిశాయి. చిన్నారులను స్పోర్ట్స్ స్కూళ్లలో చేర్పించాలనే సంకల్పం ప్రస్తుతం చాలామంది తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. అయితే రాష్ట్రంలో కేవలం మూడు స్పోర్ట్స్ స్కూళ్లే ఉండటంతో చాలా మంది విద్యార్థులకు అవకాశాలు దక్కడం లేదు.

వనపర్తిలో స్థల సేకరణ

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనైనా రెండు స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే వనపర్తి జిల్లాకేంద్రంలోని మర్రికుంట సమీపంలో స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థల సేకరణ చేపట్టారు. వెంటనే వనపర్తిలో స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించాలని ఆ ప్రాంత క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మెరుగైన క్రీడా వసతులు

గతేడాది రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూళ్లలో ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది విద్యార్థులు 4వ తరగతిలో ప్రవేశాలు పొందారు. వనపర్తితోపాటు ఉమ్మడి జిల్లాలో మరోచోట స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటైతే మరింత ఎక్కువ మంది చిన్నారులు స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికవుతారు. స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నారులకు ఎన్నో మెరుగైన క్రీడావసతులు అందుబాటులోకి వస్తాయి. పెద్ద పెద్ద భవనాలతోపాటు ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీతోపాటు ఇతర క్రీడల కోర్టులను ఏర్పాటు చేస్తారు. తొలుత చిన్నారులకు ఫ్లెక్సిబిలిటీ తదితర అంశాల్లో పరీక్షించి వారు ఏ క్రీడల్లో రాణించే అవకాశం ఉందో అందులో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆయా క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లను నియామకం చేసి చిన్నారులకు మెరుగైన క్రీడాశిక్షణ అందజేస్తాయి. అదేవిధంగా క్రీడా శిక్షణతోపాటు చదువుకూ ప్రాధాన్యం ఉంటుంది. స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు ఆహారపరంగా కూడా ప్రత్యేకమైన మెనూ అమలుచేస్తారు. డైటీషియన్ పర్యవేక్షణలో ప్రత్యేకమైన భోజనం అందిస్తారు. క్రీడా విద్యార్థులకు ఎలాంటి పోషక పదార్థాలు అవసరమో ముందుగానే మెనూ నిర్ణయించి దానికనుగుణంగా భోజన సౌకర్యం కల్పిస్తారు.

నైపుణ్యాలు వెలికి..



స్పోర్ట్స్ స్కూళ్లతో చిన్నారుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయవచ్చు. ప్రస్తుతం ఆయా క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న క్రీడాకారుల్లో చాలామంది స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన వారే.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

క్రీడాభివృద్ధికి కృషి..



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో నూతన క్రీడా పాలసీ తీసుకు రావడం సంతోషంగా ఉంది. సీఎం రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లు చిన్నారులకు ఒక మంచి వేదికలా ఉపయోగపడుతాయి. క్రీడాపాలసీతో భవిష్యత్‌లో మనకూ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

– బాలరాజు, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఈసీ మెంబర్, మహబూబ్‌నగర్

క్రీడా పాలసీలోనైనా..

రాష్ట్రంలో క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తెలంగాణ క్రీడా పాలసీ తీసుకొచ్చింది. ఇటీవలే మంత్రివర్గ సమావేశంలో నూతన క్రీడా పాలసీకి ఆమోదం తెలిపారు. ఇందులో మరిన్ని స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటు కోసం అవకాశం కల్పించాలని సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాన్‌గల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ బాలీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు నిహారిక అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తీసుకునే ఆహారం సమతుల్యంగా ఉండాలన్నారు. శారీరకంగా, మానసికంగా వచ్చే మార్పులు, భావోద్వేగాల్లో వచ్చే మా ర్పులు గమనించి లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. బా ల్య వివాహాలు చేయడం నేరమని, వాటి వల్ల కలిగే నష్టాలు వివరించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం నాగయ్యగౌడు, ఉపాధ్యాయ బృందం, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల నిరసన

మదనాపురం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మదనాపురం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే గ్రీన్ ఛానల్ ద్వారా జీపీ కార్మికులకు ఏప్రిల్ నుంచి వేతనాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి నేటికీ ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే వేతనాలు విడుదల చేసి జీపీ కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మిక సమస్యల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను ముందుకు తెచ్చిందని ఆయన ఆరోపించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మికులు మధు, నాగన్న, అశోక్, ఖాదరు, శ్రీనివాసులు, రమేష్, దస్తగిరి, బక్క శ్రీను, సహదేవుడు, తిరుపతయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



రాష్ట్ర మూడో మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న కొత్తకోట మైనార్టీలు

కొత్తకోట: దేశంలోని మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి పోయారని, వారు ఆర్థికంగా, విద్యా పరంగా అభివృద్ధి చెందాలని ఆవాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ యండీ జబ్బార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తకోట పట్టణంలోని క్యూఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మైనార్టీలు పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలతో పాటు లౌకిక ప్రజాస్వామ్యం పరిరక్షణ రాజ్యాంగ హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా విశాల ప్రాతిపదికన పనిచేస్తున్న ఏకైక సంఘం ఆవాజ్ అని అన్నారు. పేదరికం, నిరుద్యోగంతో ఇబ్బంది పడుతున్న మైనార్టీలకు రాజ్యాంగం హక్కుల కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాల కోసం ఆవాజ్ అనేక ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. గద్వాల పట్టణంలో రాష్ట్ర మూడో మహాసభలను జూలై 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి అందరు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ అతికుర్రహ్మాన్, ఎంఎ లతీఫ్, సుల్తాన్ గఫార్, ఖాజా మైనుద్దీన్, సలీంఖాన్, ఎండీ.షబ్బీర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, నరసింహ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ప్రయోజనం



వీపనగండ్ల: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పసిపిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో విలేజ్ హెల్త్ న్యూట్రీషన్‌డే సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పసిపిల్లలకు బాలామృతం, గుడ్లను పంపిణీ చేశారు. తక్కువ బరువున్న పిల్లలను గుర్తించి వారికి అదనపు పౌష్టికాహారం అందించడమే కాకుండా మెరుగైన వైద్య పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పంపిస్తామని సుగుణాబాయ్, మహేశ్వరి, ఎల్లమ్మ, సువర్ణ, కమల, కృష్ణమ్మ, పారిజాత, మాధవి, చంద్రకళ, లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో హెల్పర్లు లచ్చమ్మ, నిరంజనమ్మ, పలువురు గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న నోడల్ ఆఫీసర్ వంశీకృష్ణ

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆశాడే సందర్భంగా ఏర్పాటు ఏసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పై ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదే అన్నారు. చికెన్‌గున్యా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు అవసరమైన చికిత్సలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజశేఖర్, ఆయుష్ డాక్టర్స్ హేమవర్ధన్, కరుణశ్రీ, శ్వేత, కవిత, దయామణి, సీహెచ్‌ఓ కళమ్మ, విజయకుమారి, వైద్య సిబ్బంది రాఘవేందర్, రాములు, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం



పాన్‌గల్: అంబులెన్స్‌లో కాన్పు జరిగిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన గర్భిణి మహేశ్వరమ్మ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో దావాజీపల్లి స్టేజీ సమీపంలో ప్రసవ నొప్పులు తీవ్రమయ్యాయి. అంబులెన్స్‌లో అత్యవసర వైద్య సిబ్బంది బుద్దేష్, భాస్కర్ చాకచక్యంగా వ్యవహరించి మహేశ్వరమ్మకు కాన్పు చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను వనపర్తిలోని ఎంసీహెచ్ ఆస్పత్రికి తర లించారు. అంబులెన్స్ సిబ్బందికి మహేశ్వర మ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మరోసారి మోసపోవద్దు

గోపాల్‌పేట: అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎండగట్టాలని, వారిచ్చే హామీలకు ప్రజలు మోసపోవద్దని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ఏదుల, గోపాల్‌పేటలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలతో సమస్యలపై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటువేసి ఆదరించాలని కోరారు. ఏదుల మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేష్, రాజురెడ్డి, అబ్దుల్ మహమూద్, సునీల్, గోపాల్‌పేట మండలంలో బాల్‌రాజు పాల్గొన్నారు.

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో అకస్మాత్తుగా వరదలు వస్తే ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విపత్తు నిర్వహణపై లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. 2009లో వచ్చిన వరదలకు వనపర్తి జిల్లాలోని ఏఏ మండలాల్లో ఏఏ గ్రామాలు వరదలకు గురయ్యాయో వాటివివరాలు, నది పరివాహక ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, చిన్నంబావి, కొత్తకోట, పెబ్బేర్ ప్రాంతాల్లో అధిక వర్షాలు, లేదా కర్ణాటక, మహారాష్ట్రలలో అధిక వర్షాల వల్ల కృష్ణానది ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉంటుందని, అందుకు అనుగుణంగా ఆయా మండలాల్లో లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు, పోలీసులు, పంచాయతీ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రణాళిక అధికారి భూపాల్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి లక్ష్మప్ప, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్, ఫైర్‌శాఖ అధికారులు, కొత్తకోట సీఐ శివకుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు

టోపోనమి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

వనపర్తి జిల్లాలో టోపోనమి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సర్వేఆఫ్ ఇండియా నోడల్ అధికారి సురేష్ కుమార్ మండల పరిషత్ స్టాటిస్టిక్స్ అధికారులు, సర్వేయర్లకు నోడల్ అధికారి టోపోనమి సర్వేపై శిక్షణ ఇచ్చారు. అధికారి భూపాల్ రెడ్డి, బాలకృష్ణ, ఎంఎస్‌ఓలు ఉన్నారు.

డాక్టర్ సేవలు మరులేనివి



డాక్టర్ బీధాన్ చంద్ర రాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: జన్మనిచ్చేది తల్లిదండ్రులైతే పునఃజన్మనిచ్చి తిరిగి ప్రాణం పోసే డాక్టర్ల సేవలు ఎనలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో డాక్టర్ బీధాన్ చంద్రరాయ్ జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య వృత్తితో రోగులను, రాజకీయం ద్వారా సమాజానికి చికిత్స చేసిన బీ. దాన్ రాయ్ సేవలు మరువలేనివన్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తుగా బీధాన్ జన్మదినాన్ని జాతీయ డాక్టర్స్‌డేగా జరుపుకుంటామని పేర్కొన్నారు. కా ర్యక్రమంలో కవి 'భూరోజు గిరిరాజా చారి, మండ్ల దేవన్న నాయుడు, పరమేశ్వర చారి, కురుమయ్య, రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అమరచింత/ఆత్మకూర్: జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాషా మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు డాక్టర్ ఫయాజ్, డాక్టర్ మానస, డాక్టర్ నిఖితలను శాలువాతో సత్కరించారు.

- ఆత్మకూర్‌లో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఉన్నారు.

బీటీరోడ్డుకు ఎమ్మెల్యే హామీ



దెబ్బతిన్న బీటీ రోడ్డును కాంట్రాక్టర్‌కు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని ఇందిరాపార్కు మార్గంలో గుంతలమయమైన బీటీ రోడ్డును మెరుగు పరిచేందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ ఇచ్చారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ సమన్వయకర్త లక్కాకుల సతీష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గుంతలమయం అయిన రహదారిని ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో తాత్కాలికంగా పూర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాపార్కు రోడ్డు, బ్రహ్మంగారి ఆర్చీ సమీపంలో గుంతలమయమై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిస్థితిని కాంట్రాక్టర్‌కు చూయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ఎల్ఎన్. రమేష్, శరవంద ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మురుగును తొలగిస్తున్న మున్సిపల్ కార్మికుడు

వనపర్తిటౌన్: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని 2,18,7,33,12,8, 30వ వార్డుల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మేనేజర్ శంకరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో కలెక్టర్ ఆదేశానుల మేరకు డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలని వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు పీహెచ్‌సీ డాక్టర్ సూచించారు.

ఎర్త్ రాడ్స్‌తో ప్రమాదాల నివారణ



కార్మికుడికి ఎర్త్ రాడ్ అందజేస్తున్న అధికారులు

వనపర్తిటౌన్: ఎర్త్ రాడ్స్‌ను విద్యుత్ కార్మికులు విధి నిర్వహణలో తప్పని సరిగా వాడాలని, ఎర్త్ రాడ్స్‌తో ప్రమాదాలను నివారించవచ్చని డివిజన్ ఇంజినీర్ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో జూన్ 26 నుంచి ఈనెల 2వ తేదీ వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ సంస్థలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సిబ్బందికి నాణ్యమైన భద్రతా పరికరాలు ఇవ్వాలని కార్మిక నాయకులు వరదరాజు, వీరాచారిలు కోరారు. ఈ సందర్భంగా టెక్నికల్ డివిజన్ ఇంజనీర్ వెంకట శివరాం మాట్లాడుతూ.. ముందు కార్మికుల భద్రతే ముఖ్యమని, ఆ తర్వాతే పని అని, కార్మికులు జాగ్రత్తలు పాటిస్తున్న విధి నిర్వహణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈలు ఎస్.రాజయ్య గౌడ్, డీ శ్రీనివాస్, నరసింహ, భగవంతు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృత్యువాత

వనపర్తి రూరల్: మండలంలోని చందాపురం గ్రామంలో పాఠశాల దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తు వైర్లకు గొర్రె తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చుట్టూ కరెంట్ షాక్ వస్తుందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరారు.

పదవీ విరమణ తప్పనిసరి

పాన్‌గల్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. మండల పరిషత్ ఆఫీస్ సబార్డినేటర్ పుష్పావతి పదవీ విరమణ వీడ్కోలు సమావేశం మంగళవారం కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ వరమ్మ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గోరింటాకు మహోత్సవం



మదనాపురం: ఆషాడమాసం పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని కనక్య పరమేశ్వరి ఆలయంలో అమ్మ వారికి శాకాంబరీ దేవి అలంకరణ గోరింటాకు మహోత్సవం ఆర్య వైశ్య సంఘం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చిన మహిళా భక్తులు రకరకాల తీపి వంటకాలు తీసుకొచ్చి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు.